క్లుప్తంగా

పోలీస్ సిబ్బందికి చలువ కళ్లద్దాలు అందజేత



చలువ కళ్లద్దాలు, వాటర్ బాటిళ్లు పంపిణీ చేస్తున్న వాసవీ క్లబ్ సభ్యులు

నేరేడుచర్ల : పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో సిబ్బందికి సోమవారం సాయిస్టీల్ యజమాని ఐత శంభులింగం సహకారంతో వాసవీ, వనితా క్లబ్ ఆధ్వర్యంలో చలువ కళ్లద్దాలు, వాటర్ బాటిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆ క్లబ్ గవర్నర్ విజయలక్ష్మి మాట్లాడుతూ.. బహిరంగ ప్రదేశాల్లో విధులు నిర్వహిస్తున్న పోలీసులకు వేసవి దృష్ట్యా ఈ కళ్లద్దాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో క్లబ్ జిల్లా పీఆర్‌ఓ గరిణె అరుణకుమారి, సభ్యులు రేణిగుంట్ల శ్రీనివాస్, ఉప్పల విద్యాసాగర్, శ్రీనివాసరావు, శ్రీలత, కోటేశ్వరరావు, సతీష్, లక్ష్మీనరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు భూభారతి చట్టంపై అవగాహన సదస్సు

మోతె : మండల కేంద్రంలోని స్వస్తిక్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం భూభారతి చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు సోమవారం తహసీల్దార్ శ్రీకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. సదస్సుకు రైతులు, అధికారులు, ప్రజలు, సకాలంలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

హుజూర్‌నగర్ (చింతలపాలెం) : చింతలపాలెం మండల కేంద్రంలో మంగళవారం వీధిలైట్లు వేస్తున్నందున ఉదయం 8 గంటల నుంచి 11 గంటలకు వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఇన్‌చార్జ్ విద్యుత్ ఏఈ వెంకటేశ్వరరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

రామాలయంలో ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

చిలుకూరు : మండలంలోని ఆర్లెగూడెం గ్రామంలో గల కోదండ రామాలయంలో సోమవారం స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పూజారి శైషాచార్యులు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



టూల్ కిట్ అందజేస్తున్న నాగరాజు

నడిగూడెం : కేంద్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని చెన్నకేశ్వాపురం సీఎస్‌సీ నిర్వాహకుడు మేకల నాగరాజు కోరారు. సోమవారం మండల కేంద్రంలోని తపాలా శాఖ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో చెన్నకేశ్వాపురం గ్రామానికి చెందిన శివరాత్రి రమేష్‌కు విశ్వకర్మ పథకానికి సంబంధించిన టూల్ కిట్‌ను అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో తపాలా శాఖ సిబ్బంది హైమద్, కావ్యశ్రీ, రాందాస్, వీరస్వామి పాల్గొన్నారు.

మంచ్యాతండా ఫీల్డ్ అసిస్టెంట్ సస్పెన్షన్

- ఏపీఓ, టీఏలకు షోకాజ్ నోటీసులు

మఠంపల్లి : మండలంలోని మంచ్యాతండా గ్రామ పంచాయతీ ఫీల్డ్ అసిస్టెంట్ మాళోతు రవిని సస్పెండ్ చేస్తూ సోమవారం జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఉత్తర్వులు జారీ చేశారు. అదేవిధంగా మఠంపల్లి మండల ఏపీఓ ఉమాదేవి, టీఏ ఆర్.నరసింహకు షోకాజ్ నోటీసులు ఇచ్చారు. మంచ్యాతండాలో ఉపాధి హామీ పనుల్లో అవినీతి, అక్రమాలు జరిగాయని పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, స్థానికులు ఇటీవల జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. దీంతో ఎంపీడీఓ జగదీష్‌కుమార్ విచారణ జరిపి నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు సమర్పించారు. ఈమేరకు వారిపై కలెక్టర్ చర్యలు తీసుకున్నారు.

పశువుల వివరాలు సేకరించాలి

మునగాల : హైదరాబాద్ – విజయవాడ జాతీయ రహదారిపై పశువుల సంచారంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని,కావున మండలంలోని గ్రామాల్లో పశువులు పెంచుతున్న వారి వివరాలను ఎమ్మార్పీఎస్ గ్రామశాఖ అధ్యక్షులు సేకరించాలని ఎమ్మార్పీఎస్ మండల శాఖ అధ్యక్షుడు గుడిపాటి కనకయ్య మాదిగ కోరారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎండల దృష్ట్యా హైవే పక్కన ఉన్న గ్రామాల్లోని పశువులు రేయింబవళ్లు రోడ్డుపైకి వస్తుండడంతో ప్రమాదాలు సంభవిస్తున్నాయని తెలిపారు. పశువుల వివరాలను సేకరించి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అందజేయాలని నిర్ణయించినట్లు తెలిపారు.

మూడేళ్లుగా ఆగుతూ.. సాగుతూ

- నత్తనడకన గణపవరం ఆరోగ్య ఉపకేంద్రం నిర్మాణం
- పనుల్లో కాంట్రాక్టర్ తీవ్ర జాప్యం
- త్వరితగతిన పూర్తి చేయాలని ప్రజల వేడుకోలు



గణపవరంలో నిర్మించిన ఆరోగ్య ఉపకేంద్రం భవనం



ప్లాస్టరింగ్ చేయకుండా వదిలేసిన భవనం లోపలివైపు భాగం

కోదాడరూరల్ : కోదాడ మండలంలోని గణపవరంలో చేపట్టిన ఆరోగ్య ఉప కేంద్రం నూతన భవన నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. మూడేళ్లుగా ఆగుతూ.. సాగుతున్నాయి. కాంట్రాక్టర్ ఇదే మాదిరిగా నిర్లక్ష్యం చేస్తే పనులు పూర్తి కావడానికి మరో ఏడాది సమయం పట్టిన ఆశ్చర్యం పోవాల్సిన అవసరం లేదు. గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలనే లక్ష్యంతో పదివేల జనాభాకు ఓ ఆరోగ్య ఉప కేంద్రం నిర్మాణానికి నాటి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. మూడు, నాలుగు గ్రామాలకు కూడలిలో ఉన్న మేజర్ గ్రామంలో ఆరోగ్య ఉప కేంద్రం నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో ఆరోగ్య ఉప కేంద్రం నిర్మాణానికి జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్ నుంచి రూ.15 లక్షల నిధులు మంజూరు కాగా, గణపవరంలో గతంలో శిథిలావస్థకు చేరుకున్న సబ్ సెంటర్ భవనాన్ని కూల్చి నూతన భవనం నిర్మించేందుకు 2022 జనవరిలో నాటి ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ చేతుల మీదుగా పనులు ప్రారంభించారు. కానీ కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో నేటి వరకు పనులు పూర్తి కాలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

పనుల్లో తీవ్ర జాప్యం..

ఆరోగ్య ఉప కేంద్రం పనులను ప్రారంభించిన ఆరు నెలల్లో పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాల్సి ఉంది. కానీ మూడేళ్లయిన కాంట్రాక్టర్ పలు కారణాలతో పనుల్లో జాప్యం చేస్తున్నట్లు విమర్శలొస్తున్నాయి. టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టర్ తాను భవనాన్ని కట్టకుండా సబ్ కాంట్రాక్ట్ ఇవ్వడంతో పనులను స్లాబు ఒకసారి, గోడలు మరోసారి, సంవత్సరం ఆగిన తర్వాత బయటవైపు గోడలు ప్లాస్టరింగ్ చేసి లోపటి వైపు సగం వరకు చేసి ఇంటీరియల్ పనులను చేయకుండానే మధ్యలోనే వదిలేశాడు. ఇప్పటికైనా అధికారులు కలుగజేసుకొని వెంటనే పనులు ప్రారంభించి నూతన భవనాన్ని పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

ఆరోగ్య ఉపకేంద్రాన్ని అందుబాటులోకి తేవాలి



గణపవరంలో ఆరోగ్య ఉపకేంద్రం భవన నిర్మాణానికి మూడున్నరేళ్ల క్రితం శంకుస్థాపన చేశారు. నాటి నుంచి నేటికీ కాంట్రాక్టర్ పనులు పూర్తి చేయలేదు. భవనం లేకపోవడంతో అటు వైద్యారోగ్య సిబ్బంది, ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు స్పందించి కాంట్రాక్టర్‌తో వెంటనే పనులు పూర్తి చేయించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి.

– ఇర్ల సీతరాంరెడ్డి, గణపవరం

త్వరలో పనులు పూర్తిచేస్తాం

గణపవరంలో ఆరోగ్య ఉప కేంద్రం భవన నిర్మాణ పనులను త్వరలోనే పూర్తి చేస్తాం. పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచిస్తున్నాం. బిల్లులు రాగానే పనులు పూర్తి చేస్తామని కాంట్రాక్టర్ చెబుతున్నాడు. బిల్లులు రాగానే పనులు చకచకా చేపట్టి పూర్తి చేయిస్తాం.

– ప్రశాంత్, టీఎస్‌ఎం ఐడీసీ ఏఈ, కోదాడ

భూమి ఉన్న ప్రతి రైతుకూ 'భూధార్'

- కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

చిలుకూరు: భూమి ఉన్న ప్రతి రైతుకు భూ భారతి చట్టంలో భూధార్ కార్డు ఇవ్వనున్నట్లు కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ తెలిపారు. సోమవారం చిలుకూరులో నిర్వహించిన భూభారతి అవగాహన సదస్సులో కలెక్టర్ మాట్లాడారు. రెవెన్యూ రికార్డుల నిర్వహణకు త్వరలో ప్రతి గ్రామానికి ఒక అధికారిని ప్రభుత్వం నియమిస్తుందని చెప్పారు. పెండింగ్‌లో ఉన్న రైతుల భూ సమస్యలు భూభారతి చట్టం ద్వారా పూర్తి స్థాయిలో పరిష్కారం అవుతాయన్నారు. ఈకార్యక్రమానికి వచ్చినవారు గ్రామాలకు వెళ్లి ప్రతి ఒక్కరికీ ఈ చట్టం పై అవగాహన కల్పించి భూ సమస్యలు పరిష్కారం అయ్యేలా చూసుకోవాలని కోరారు. త్వరలో జిల్లాలో ఒక మండలాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి భూ భారతి చట్టాన్ని పూర్తి స్థాయిలో ప్రణాళిక ప్రకారం అమలు చేసి భూ సమస్యలను పరిష్కారం చేస్తామన్నారు. ఆతర్వాత క్రమంగా అన్ని మండలాలు, గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు పెట్టి ఈ చట్టాన్ని అమలు చేస్తామన్నారు. ఈ సదస్సులో ఆర్డీఓ సూర్యనారాయణ, తహసీల్దార్ ధృవ కుమార్, ఎంపీడీఓ గిరిబాబు, ఎంపీఓ ముక్కపాటి నరసింహారావు, డీటీ కరుణ శ్రీ, ఏఓ శ్రీధర్, సీనియర్ అసిస్టెంట్ పుష్పలత, ఆర్ఐలు మంత్రిప్రగడ సీతారామచందర్‌రావు, శ్వేత , చిలుకూరు, నారాయణపురం ఫ్యాక్స్ చైర్మన్లు కొండా సైదులు, అలసకాని జనార్దన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రవాదం నిర్మూలనకు కలిసి పోరాడుదాం



హుజూర్‌నగర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

హుజూర్‌నగర్ : ఉగ్రవాదం నిర్మూలనకు అందరం కలిసి పోరాడుదామని పట్టణ కాంగ్రెస్, శాంతి సంఘం అధ్యక్షులు తన్నీరు మల్లికార్జున్‌రావు అన్నారు. కశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రవాదుల కాల్పుల్లో ప్రాణాలు కోల్పోయిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని సోమవారం హుజూర్‌నగర్‌లో ఇందిరా భవన్ నుంచి మెయిన్ రోడ్డు మీదుగా శాంతి స్థూపం వరకు పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో జాతీయ జెండాలతో వెలుగుతున్న కొవ్వొత్తులు పట్టుకుని ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయుల ఐక్యత చాటి చెప్పేలా శాంతి స్థాపనకు నడుం బిగిద్దామన్నారు. నాయకులు నల్ల రిబ్బన్లు ధరించి ఉగ్రవాద నిర్మూలనకు పోరాడుదామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో నాయకులు సాముల శివారెడ్డి, అరుణ్‌కుమార్ దేశ్‌ముఖ్, గల్లా వెంకటేశ్వర్లు, అజీజ్ పాషా, రాజానాయక్, సావిత్రి, కోటమ్మ, ఉపేందర్ యాదవ్, గొట్టే రామయ్య, నర్సింగ్ వెంకటేశ్వర్లు, జక్కుల మల్లయ్య, ముశం సత్యనారాయణ, బి. చంద్రశేఖర్, అమర్‌నాథ్‌రెడ్డి, బెంజిమన్, పి. రామరాజు యోహాన్, ముక్కంటి, బి.గురవయ్య, వై.వీరబాబు, సుబ్బారాజు, వై.పిచ్చయ్య కె.దిల్, సైదులు, రాము, రవీందర్, గణేష్, పుల్లయ్య, జి.రాములు, బి.వెంకటనారాయణ, మజీద్, యూసఫ్, సుధాకర్, డేవిడ్ రాజు, ఉదయ్‌బాబు, మహిళా, యూత్ నాయకులు పాల్గొన్నారు.

రాజ్యాంగ విలువలను కాపాడడమే లక్ష్యం



నేరేడుచర్లలో ర్యాలీ నిర్వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు

నేరేడుచర్ల : రాజ్యాంగ విలువలపై ప్రజల్లో అవగాహన పెంచటమే కాంగ్రెస్ పార్టీ లక్ష్యమని పార్టీ నేరేడుచర్ల పట్టణ అధ్యక్షుడు నూకల సందీప్‌రెడ్డి అన్నారు. జై బాపు, జైభీమ్, జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం నేరేడుచర్ల మున్సిపాలిటీ పరిధిలోని 6, 7, 9 వార్డుల్లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సందీప్‌రెడ్డి మాట్లాడుతూ రాజ్యాంగ విలువలను కాపాడటంతో పాటు ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకునేందుకు రాహుల్ గాంధీ జైబాపు, జైభీమ్, జైసంవిధాన్ కార్యక్రమానికి పిలుపునిచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ బచ్చలకూరి ప్రకాష్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తాళ్ల సురేష్ రెడ్డి, డైరెక్టర్ మచ్చ శీను, మాజీ కౌన్సిలర్ రణపంగ నాగయ్య, రామాపురం మాజీ సర్పంచ్‌లు చింతమల్ల సైదులు, జంగిలి వెంకటేశ్వర్లు, రాచకొండ అజయ్, నాయకులు ఇస్తియాక్, కలీం, కె.శ్రీను, కె.నాగరాజు, సీహెచ్.సైదులు, వీరబాబు, ఉదయ్, సతీష్, నాగరాజు, పాపయ్య, హరిబాబు, జాను, వెంకటయ్య, మంగ్య, తదితరులు పాల్గొన్నారు.

రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలి

నేరేడుచర్ల : నూతనంగా పట్టాదారు పాస్ పుస్తకాలు పొందిన రైతులు మే 10వ తేదీ లోగా రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి జావేద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతుబీమా దరఖాస్తుకు పట్టాదారు పాస్‌బుక్, ఆధార్, నామినీ ఆధార్ జిరాక్స్‌లను జతచేసి వ్యవసాయ కార్యాలయంలో సమర్పించాలని కోరారు.

అడ్లూరులో పశువైద్య శిబిరం



పశువైద్య శిబిరంలో పాల్గొన్న వైద్యులు, సంఘం డైరీ ప్రతినిధులు

కోదాడరూరల్ : మండలంలోని అడ్లూరులో కోదాడలోని సంఘం డైరీ యూనిట్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత పశువైద్య శిబిరం ఏర్పాటు చేశారు. గేదెలు, ఆవులకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వాటికి మందులు అందజేశారు. ఈ సందర్భంగా డైరీ జోనల్ హెడ్ కె.నాగప్రభు మాట్లాడుతూ.. తమ డైరీ ఆధ్వర్యంలో పాడి రైతులకు బీమా, వైద్యశిబిరాలు, గడ్డి విత్తనాల పంపిణీ వంటి పలు రకాల సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పశువైద్యులు యశ్వంతరావు, ప్రదీప్, ఉమామహేశ్వరరావు, డైరీ కోదాడ ప్లాంట్ మేనేజర్ డి.వరప్రసాద్, సూపర్‌వైజర్ రమేష్, రామకృష్ణ, ఏజెంట్ కృష్ణారెడ్డి, రైతులు ఉన్నారు.

'మైహోం' ఉద్యోగులకు బహుమతులు



బహుమతులు అందుకున్న పరిశ్రమ ఉద్యోగులు

మేళ్లచెరువు : జాతీయ భద్రత వారోత్సవాలను పురస్కరించుకొని హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన వివిధ పోటీల్లో మేళ్లచెరువు మండల కేంద్రం పరిధిలోని మైహోం సిమెంట్ పరిశ్రమ ఉద్యోగులు బహుమతులు గెలుచుకున్నట్లు పరిశ్రమ అధికారులు సోమవారం తెలిపారు. అందుకున్నట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన పోటీల్లో తెలుగు సేఫ్టీ స్లోగన్ విభాగంలో ప్రథమ, తెలుగు సేఫ్టీ వ్యాసరచన విభాగంలో ప్రథమ, సేఫ్టీ హిందీ వ్యాసరచన విభాగంలో ద్వితీయ బహుమతి, ఇంగ్లిష్ సేఫ్టీ స్లోగన్ విభాగంలో తృతీయ బహుమతులను రాష్ట్ర పరిశ్రమల శాఖ డైరెక్టర్ బి.రాజగోపాల్ చేతుల మీదుగా అందుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా బహుమతులు పొందిన వారిని పరిశ్రమ ప్రెసిడెంట్ యన్.శ్రీనివాసరావు అభినందించారు.

నాలుగు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

అనంతగిరి : అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను అనంతగిరి పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై నవీన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం జగ్గయ్యపేట మండలం మల్కాపురం గ్రామానికి చెందిన పలువురు ట్రాక్టర్లలో అక్రమంగా ఇసుక తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. మండలంలోని తమ్మర వద్ద ఆదివారం ఒక ట్రాక్టర్, గొండ్రియల శివారులో సోమవారం మూడు ట్రాక్టర్లను పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. ఈమేరకు నెమ్మాది జక్కయ్య, సనగాల వెంకటేశా, లింగనబోయిన రమేష్, బాలంత గణేష్, పోతుల శేఖర్, బొమ్మన ఉపేందర్, నడికొప్పుల వీరబాబుపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

గోపాలకృష్ణమూర్తికి సన్మానం

హుజూర్‌నగర్ : హుజూర్‌నగర్ బార్ అసోసియేషన్ కోశాధికారిగా ఎన్నికైన సీనియర్ న్యాయవాది ఉప్పల గోపాలకృష్ణమూర్తిని సోమవారం స్థానిక కాంగ్రెస్ నాయకులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు రామారావు, నాగరాజు, రూపేష్, శ్రీనివాస్, రామనరేష్ తదితరులు పాల్గొన్నారు.

మేడేను జయప్రదం చేయాలి



సమావేశంలో పాల్గొన్న నాయకులు

గరిడేపల్లి : ప్రపంచ కార్మికుల దినోత్సవం (మేడే)ను జయప్రదం చేయాలని సీపీఐ మండల కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు, ఏఐటీయూసీ మండల అధ్యక్షుడు బెజ్జం రమేష్.. కార్మికులు, శ్రామికులకు పిలుపునిచ్చారు. సోమవారం గరిడేపల్లి మండల కేంద్రంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో ఏఐటీయూసీ అనుబంధ సంఘాల కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఏఐటీయూసీ అనుబంధ సంఘాల కార్మికులు, సీపీఐ కార్యకర్తలు మేడేను వాడవాడలా నిర్వహించి ఎర్ర జెండాలు ఎగురవేయాలన్నారు. సమావేశంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు ఆనందరావు, నందిపాటి కనకయ్య, పిట్టా రామకృష్ణ, మాచర్ల రవి, సతీష్, వినోద్, సాహెబ్, యడ్ల అంజిరెడ్డి, ప్రతాని సైదులు తదితరులు పాల్గొన్నారు.


పోషకాహారం తీసుకోవాలి



న్యూట్రిషన్ కిట్లు పంపిణీ చేస్తున్న డాక్టర్ యశ్వంత్‌కుమార్

హుజూర్‌నగర్‌రూరల్ : క్షయ వ్యాధిగ్రస్తులు క్రమం తప్పకుండా పోషకాహారం తీసుకోవాలని, సకాలంలో మందులు వేసుకోవాలని మండల వైద్యాధికారి డాక్టర్ యశ్వంత్‌కుమార్ సూచించారు. సోమవారం మండలంలోని లింగగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రభుత్వం నుంచి వచ్చిన న్యూట్రిషన్ కిట్లను 34 మంది టీబీ వ్యాధిగ్రస్తులకు పంపిణీ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ అధికారి పద్మ, పీహెచ్‌ఎన్ నూర్జహాన్, హెచ్‌ఏలు రామకృష్ణ, శ్రీనివాస్, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు



హుజూర్‌నగర్ : చలివేంద్రం ప్రారంభిస్తున్న డీఎం శ్రీనివాసరావు

హుజూర్‌నగర్ : పట్టణంలోని కొత్త బస్టాండ్‌లో హుజూర్‌నగర్ వాసవీ క్లబ్, వాసవీ వనితా క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సోమవారం కోదాడ ఆర్టీసీ డిపో మేనేజర్ బి.శ్రీనివాసరావు ప్రారంభించారు. కార్యక్రమంలో కంట్రోలర్ సుధాకర్‌రెడ్డి, క్లబ్ సభ్యులు కె.పాపారావు, వెంకటేశ్వర్లు, ఝాన్సీరాణి, రామ్ నరేష్, దయాకర్, శ్రీనివాస్, నాని, చిరంజీవి, స్వామి, గోపి, ప్రవీణ్, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

మంచ్యాతండాలో..

మఠంపల్లి : మండలంలోని మంచ్యాతండాలో గల గ్రామ పంచాయతీ కార్యాలయంలో చలివేంద్రాన్ని ఓయూ జేఏసీ నాయకుడు సపావట్ సుమన్ నాయక్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచ్యాతండా గ్రామ పంచాయతీ కార్యాలయం ప్రధాన రహదారిపై ఉండటంతో వేసవి దృష్ట్యా వాహనాదారుల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రి ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు భూక్యారాముడు నాయక్, పానుగోతు నాగేశ్వరరావు, భోజ్యానాయక్ తదితరులు ఉన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ తొలగించండి సారూ



ట్రాన్స్‌ఫార్మర్ తొలగించాలని చేతులు జోడించి వేడుకుంటున్న సంధ్య కుటుంబం

మఠంపల్లి : మండలంలోని కామంచికుంటతండాలో తమ ఇంటి ముందు ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించాలని గిరిజన మహిళ బానోతు సంధ్య కుటుంబం వేడుకుంటోంది. ఈ సందర్భంగా ఆమె సోమవారం మాట్లాడుతూ.. తాము నిర్మించుకున్న ఇంటి ముందు ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించాలని ఏడాదిన్నర కాలంగా ట్రాన్స్‌కో అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. తన భర్త చనిపోయాడని, ముగ్గురు పిల్లలతో బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నానని, రాత్రి వేళలో ఈదురుగాలులు, వర్షం వచ్చినప్పుడు ట్రాన్స్‌ఫార్మర్ నుంచి నిప్పు రవ్వలు వస్తున్నాయని, దీంతో భయంతో తమ పిల్లలతో సహా రాత్రంతా జాగారం చేస్తున్నామని తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్ అడ్డుగా ఉండడంతో ఇంటి నుంచి వీధిలోకి భయంభయంగా వెళ్తున్నామని తెలిపారు. స్థానిక సర్పంచ్ సునీతాలాలునాయక్ మాట్లాడుతూ అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ తొలగించాలని, లేనట్లయితే జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని అన్నారు.

రౌడీషీటర్లు, నేరస్తులపై ప్రత్యేక నిఘా



రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ ఇస్తున్న సీఐ చరమందరాజు

హుజూర్‌నగర్ : రానున్న ఎన్నికల నేపథ్యంలో రౌడీషీటర్లు, నేరస్తులపై ప్రత్యేక నిఘా పెట్టామని సీఐ చరమందరాజు అన్నారు. ప్రజా పోలీస్ భరోసా కార్యక్రమంలో భాగంగా వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్న రౌడీ షీటర్లను సోమవారం హుజూర్‌నగర్ సీఐ కార్యాలయానికి పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. రాబోయే గ్రామ, మండల, జిల్లా పరిషత్, మున్సిపాలిటీ ఎన్నికల్లో రౌడీ షీటర్లు ఎలాంటి నేరాలకు పాల్పడకుండా ఉండాలని చెప్పారు. ప్రతిఒక్కరూ మంచి ప్రవర్తనతో మెలగాలని సూచించారు. గ్రామాలు, పట్టణాల్లో శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలిగించినా కఠిన చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఐలు ముత్తయ్య, లక్ష్మీనారాయణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభం



దెబ్బతిన్న స్తంభం పునాది



ఒరిగిన విద్యుత్ స్తంభం

హుజూర్‌నగర్ : మున్సిపాలిటీ పరిధిలోని ఫణిగిరి గుట్టకు వెళ్లే రోడ్డులో విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా ఉంది. స్తంభానికి వేసిన పునాది దెబ్బతినడంతో ఒకవైపు ఒరిగి కూలేందుకు సిద్ధంగా ఉంది. నిత్యం ఆ దారిలో వాహనాల రాకపోకలు సాగుతుంటాయి. కావున ఆ దారిలో వచ్చిపోయే వాహనదారులపై స్తంభం పడి ప్రమాదం జరగక ముందే సంబంధిత అధికారులు స్పందించి విద్యుత్ స్తంభాన్ని లోతులో పాతించాలని పలువురు స్థానికులు కోరుతున్నారు.

బాల భవన్ శిక్షణ భవితకు భరోసా

సూర్యాపేట అర్బన్ : బాల భవన్‌లో అడ్మిషన్లు జోరుగా సాగుతున్నాయని, బాల భవన్ శిక్షణ భవితకు భరోసా అని పేరెంట్స్ కమిటీ అధ్యక్షులు వెన్న కవిత అన్నారు. సోమవారం బాలభవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఏదో ఒక కళను నేర్చుకోవాలని అన్నారు. మన సంస్కృతి సంప్రదాయాలను తెలుసుకోవాలని అన్నారు. లలిత కళల్లో శిక్షణ పొందిన వారికి సృజనాత్మకత మెరుగుపడుతుందని తెలిపారు. మెదడు చురుకుదనం పెరుగుతుందని అన్నారు. విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బాల్ భవన్‌లో శిక్షణ పొందిన వారికి నిరుద్యోగ సమస్యే ఉండదని తెలిపారు. బాల భవన్‌లో అందించే శిక్షణతో సొంతంగా ఉపాధి అవకాశాలు పొందవచ్చని ఆమె సూచించారు. వేసవితోపాటు ఏడాది పొడవునా సాయంత్రం కూడా శిక్షణ కార్యక్రమాలు కొనసాగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాల భవన్ సూపరింటెండెంట్ బండి రాధాకృష్ణరెడ్డి, సిబ్బంది దాసరి ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు అందక ఎఫ్‌ఏల వెతలు

- నాలుగు నెలలుగా ఫీల్డ్ అసిస్టెంట్ల వేతనాలు పెండింగ్
- ఏపీఓతో పాటు కార్యాలయ సిబ్బందికీ అందని జీతాలు
- వెంటనే చెల్లించాలని వేడుకోలు



గరిడేపల్లిలో ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు

గరిడేపల్లి : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ల (ఎఫ్‌ఏ)లకు గత మూడు నెలలుగా జీతాలు రాకపోవడంతో నానా ఇబ్బందులు పడుతున్నారు. వారితో పాటు ఉపాధి హామీ కార్యాలయ సిబ్బందికి, ఏపీఓ, కంప్యూటర్ ఆపరేటర్లు, ఈసీలకు కూడా వేతనాలు అందడం లేదు. మండల వ్యాప్తంగా 32 గ్రామ పంచాయతీల పరిధిలో 18 మంది ఫీల్డ్ అసిస్టెంట్లు పనిచేస్తున్నారు. మండలంలో 17078 జాబ్ కార్డులు ఉండగా 12700 జాబ్‌కార్డుల ద్వారా మొత్తం 25400 మంది కూలీలు ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకుంటున్నారు. గత నెలలో పంట కాల్వ పనులు చేసిన కూలీలు ప్రస్తుతం ఫార్మేషన్ రోడ్ల పనులు చేపడుతున్నారు. అయితే కూలీలకు పనులు కల్పిస్తూ క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు జనవరి, ఫిబ్రవరి, మార్చి నెలలో వేతనాలు రాలేదు. ఏప్రిల్ నెల కూడా పూర్తికావస్తున్నా ఇంతవరకు వేతనాలు చెల్లించలేదు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి పెండింగ్ వేతనాలు విడుదల చేయాలని ఉపాధి హామీ సిబ్బంది కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం



గత నాలుగు నెలలుగా మాకు వేతనాలు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. వేతనాలు రాకున్నా ఉపాధి హామీ కూలీలకు ప్రతిరోజు పనులు కల్పిస్తూనే ఉన్నాం. కావున ప్రభుత్వం ఫీల్డ్ అసిస్టెంట్లకు వెంటనే జీతాలు విడుదల చేయాలి. ప్రతినెలా ఒకటో తేదీన వేతనాలు అందించాలి.

– షేక్ సైదాబీ, ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం మండల అధ్యక్షురాలు

వేతనాలు విడుదల చేయాలి



గత నాలుగు నెలలుగా మాకు కూడా వేతనాలు రావడం లేదు. ఫీల్డ్ అసిస్టెంట్లు, ఈసీ, కంప్యూటర్ ఆపరేటర్లకు కూడా జీతాలు అందక నాలుగు నెలలు. జీతాలు రాకపోవడంతో ఇబ్బంది పడాల్సి వస్తోంది. ప్రభుత్వం వెంటనే వేతనాలు విడుదల చేయాలి.

– రాతికింది సురేష్, ఏపీఓ, గరిడేపల్లి